సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం | 13 | మే | 2024



జిల్లా.. పరిశ్రమల ఖిల్లా

నూతనంగా ఆవిర్భవించిన శ్రీసత్యసాయి జిల్లా ప్రభుత్వ చొరవతో పరిశ్రమల ఖిల్లాగా మారింది. దీంతో యువతకు స్థానికంగానే ఉపాధి దొరుకుతోంది. 8లో



రైతు ఇంట.. సంక్షేమ పంట

వైఎస్ జగన్ హయాంలో రైతు ఇంట సంక్షేమ పంట పండుతోంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో వ్యవసాయ, అనుబంధ రంగాలు పురోగతి సాధించాయి. 10లో

గరిష్టం/కనిష్టం
40.2°/24.1°

జిల్లావ్యాప్తంగా ఆదివారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కొనసాగింది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

పోలింగ్‌కు పటిష్ట భద్రత

- విధుల్లో 3,200 మంది పోలీసులు
- సమస్యాత్మక కేంద్రాలపై నిఘా
- జిల్లా ఎస్పీ మాధవరెడ్డి



హిందూపురం ఎంజీఎం పాఠశాల వద్ద పరిస్థితి సమీక్షిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం చేయడంతో పాటు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. ఆదివారం పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పనిచేస్తోందన్నారు. ఎన్నికల విధుల్లో 3,200 మంది పోలీసులు పాల్గొంటున్నట్లు తెలిపారు. 13 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు విధుల్లో ఉన్నాయన్నారు. 299 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం చేశామన్నారు. అవసరమైన చోట్ల సీసీ కెమెరాలతో పాటు డ్రోన్ కెమెరాలు, వీడియో కెమెరాల వినియోగిస్తున్నామన్నారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణం కల్పించామన్నారు. పోలింగ్ నేపథ్యంలో జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉందని, హద్దు మీరితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మాధవరెడ్డి హెచ్చరించారు. పోలింగ్ సరళి, కేంద్రాల వద్ద పరిస్థితిపై కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షణ ఉంటుందన్నారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలన

ఆదివారం ఎస్పీ మాధవరెడ్డి పెనుకొండ, పుట్టపర్తి, హిందూపురం ప్రాంతాల్లోని రిసెప్షన్ కౌంటర్లు, స్ట్రాంగ్ రూములు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట డీఎస్పీలు వాసుదేవన్, బాజీ జాన్ సైదా, కంజాక్షన్ ఉన్నారు.

నేడే పోలింగ్

- కేంద్రాలకు చేరిన ఎన్నికల సామగ్రి
- ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ కట్టుదిట్టమైన భద్రత
- పోలింగ్ నిర్వహణలో 13 వేల మంది సిబ్బంది
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 16.56 లక్షల మంది ఓటర్లు

16,56,774
జిల్లాలోని ఓటర్ల సంఖ్య

1,873
పోలింగ్ కేంద్రాలు

299
సమస్యాత్మకమైనవిగా గుర్తించిన కేంద్రాలు

13,310
ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది



పుట్టపర్తి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద సామగ్రి సరిచూసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల ముఖ్య ఘట్టమైన పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. జిల్లాలో 16.56 లక్షల మంది ఓటర్లుండగా, హిందూపురం పార్లమెంట్ స్థానం నుంచి 13 మంది, ఏడు అసెంబ్లీ నియోజకవర్గ స్థానాల నుంచి 91 మంది అభ్యర్థులు తలపడుతున్నారు.

16.56 లక్షల మంది ఓటర్లు..

జిల్లాలో 16,56,774 మంది ఓటర్లు ఉన్నారు. అందులో మహిళలు 8,32,651 మంది, పురుషులు 8,24,048 మంది, ఇతరులు 76 మంది ఉన్నారు. వారిలో 85 ఏళ్ల వయస్సు పైబడిన వారు 8,372 మంది ఉండగా, 100 ఏళ్ల పైబడిన వారు 13 మంది ఉన్నారు. వీరిలో ఇప్పటికే 34,318 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. మిగిలిన వారంతా సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరిన సామగ్రి..

జిల్లాలో 1,873 పోలింగ్ కేంద్రాలు ఉండగా, మొత్తంగా 13,310 మంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. 923 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేశారు. సమస్యాత్మకమైనవిగా గుర్తించిన 299 కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం నుంచి ఉన్నతాధికారులు పోలింగ్‌ను పర్యవేక్షించనున్నారు.

బూత్‌లకు చేరిన సామగ్రి..

ఆదివారం 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏడు చోట్ల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు ఏర్పాటు చేసిన జిల్లా ఉన్నతాధికారులు ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందజేశారు. 483 వాహనాల్లో సామగ్రి తరలించారు. దీంతో సిబ్బంది అందరూ సాయంత్రానికి తమకు కేటాయించిన పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు అన్ని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించారు.

క్యూఆర్ కోడ్‌తో ఓటరు స్లిప్పు..

ఓటరు స్లిప్పులపై ఈ సారి క్యూఆర్ కోడ్ ముద్రించారు. దీన్ని స్కాన్ చేస్తే పోలింగ్ కేంద్రం వివరాలు తెలుస్తాయి. అక్కడికి ఎలా వెళ్లాలో కూడా గూగుల్ మ్యాప్ చూపిస్తుంది. జిల్లాలో 99 శాతం మంది ఓటర్లకు బీఎల్‌ఓల ద్వారా ఓటరు స్లిప్పులు పంపిణీ పూర్తి చేశారు. ఎవరికైనా ఓటరు స్లిప్పు రాకపోతే 1950 నంబర్‌కు ఓటరు కార్డు నంబర్ ఎస్‌ఎంఎస్ చేస్తే పోలింగ్ కేంద్రం నంబర్, క్రమ సంఖ్య నంబర్ వివరాలు తెలుసుకోవచ్చు.

13 రకాల కార్డులకు అనుమతి..

ఓటరు కార్డు లేని ఓటరు ఎన్నికల కమిషన్ ఆమోదించిన 13 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఇందులో ఆధార్, ఉపాధి హామీ జాబ్ కార్డు, ఫొటోతో కూడిన బ్యాంకు పాస్ పుస్తకం, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, పాస్‌పోర్టు, స్మార్ట్ కార్డు, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన గుర్తింపు కార్డు, ఐడీ కార్డు, అధికారిక గుర్తింపు కార్డులు తదితర కార్డులు చూపించవచ్చు.

సెల్‌ఫోన్‌కు అనుమతి లేదు..

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకుని వెళ్లిపోవాలి. గుంపులుగా కేంద్రాల వద్ద ఉండకూడదు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ అనుమతించబోరు.



డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు



పుట్టపర్తి నుంచి సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న అధికారులు


పోలింగ్‌కు పటిష్ట చర్యలు

"పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాం. జిల్లాలోని 1,873 పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలన్నీ కల్పించాం. సమస్యాత్మకమైనవిగా గుర్తించిన 299 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ మరింత పకడ్బందీగా చేపడుతున్నాం. పోలింగ్ సందర్భంగా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి."

– అరుణ్‌బాబు,
జిల్లా ఎన్నికల అధికారి

ఆలోచించు.. మంచికి ఓటెత్తు

రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత పాదుగొల్పాలంటే నీ ఓటే కీలకం. ఈ వజ్రాయుధాన్ని నీవు సంధించే తీరును బట్టే నీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. గతాన్ని గుర్తు చేసుకుని, వర్తమానాన్ని బేరీజు వేసుకుని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఓటేయకపోతే..తద్వారా కలిగే నష్టాన్ని భరించాల్సింది నీవే. కేవలం నీ గురించే కాదు.. పిల్లలు, పెద్దల శ్రేయస్సునూ దృష్టిలో ఉంచుకోవాలి. నీ ఊరు, జిల్లా ప్రగతిని కాంక్షించాలి. అంధకారం నుంచి వెలుగులోకి తెచ్చిన పాలకుడిని గౌరవించాలి. మరింత వెలుగులు నింపాలన్న సంకల్పం కల్గిన నేతకు పట్టం కట్టాలి.



"ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే ప్రతి పౌరుడూ తన అంతరంగంలో ప్రజాస్వామిక సంస్కారాన్ని అలవర్చుకోవాలి. ప్రజాస్వామ్య సంస్కారం బయట ఎక్కడి నుంచో వచ్చింది కాదు. మనలో నుంచి, మన మనసులో నుంచి వచ్చిందే. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే పౌరులు తమ బాధ్యత తెలుసుకోవాలి. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి." – మహాత్మాగాంధీ



సాక్షి, పుట్టపర్తి: ఉమ్మడి అనంతపురం జిల్లా రాజకీయ చైతన్యానికి ప్రతీక. మంచిని గౌరవించి, చెడును ఖండించడంలో జిల్లా వాసులు ఎప్పుడూ ముందుంటారు. ఐదేళ్ల క్రితం జిల్లా అంతటా తీవ్ర కరువు పరిస్థితులు ఉండేవి. పంటలు పండక, పనుల్లేక రైతులు, ప్రజలు నరకయాతన అనుభవించారు. పొట్టచేతబట్టుకుని ముంబై, బెంగళూరు, కేరళ తదితర ప్రాంతాలకు వలసలు వెళ్లిన అనుభవాలు, అక్కడ దిక్కులేని చావులకు గురైన సందర్భాలూ ఉన్నాయి. ఆ తర్వాత పాలకులు మారడంతో జిల్లా పరిస్థితుల్లోనూ మార్పులు వచ్చాయి. వరుణుడు కూడా కరుణ చూపడంతో వర్షాలు సమృద్ధిగా కురిశాయి. చెరువులు, కుంటలు, వాగులు, వంకలన్నీ జలకళను సంతరించుకున్నాయి. హంద్రీ-నీవా, హెచ్చెల్సీ లాంటి నీటి వనరులకూ సమృద్ధిగా జలాలు రావడంతో జీడిపల్లి, పీఏబీఆర్, మిడ్‌పెన్నార్, గొల్లపల్లి, యోగివేమన తదితర రిజర్వాయర్లన్నీ కళకళలాడాయి. పొలాలన్నీ పైరు పంటలతో సస్యశ్యామలంగా మారాయి. ఉద్యాన పంటల సాగులో విప్లవం వచ్చింది. ఏకంగా 2.15 లక్షల హెక్టార్లకు ఉద్యాన పంటలు చేరుకున్నాయి. మనుషులతో పాటు పశుపక్ష్యాదులకూ తిండి, నీటికొరత తీరింది.

ప్రగతి బాటలు..

నేడు పల్లెల్లోనే కాదు..పట్టణాల్లోనూ ప్రగతి బాటలు పరుచుకున్నాయి. పాలన ముంగిటకే వచ్చింది. ప్రతిఊరు, వీధిలో పౌరసేవలు అందించేందుకు వీలుగా సచివాలయాలు ఏర్పాటయ్యాయి. ఏ సేవ కావాలన్నా ఊరు దాటి ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు. మన ఊళ్లోనే, అదీ మన ఇంటి వద్దకే అన్నీ వచ్చి చేరుతున్నాయి. గతంలో లాగా జన్మభూమి కమిటీల పెత్తనం లేదు. ఏ నాయకుని సిఫారసూ అవసరం లేదు. అర్హత ఉంటే చాలు వెంటనే పథకాలు ఇచ్చేస్తున్నారు. పైగా పథకాల నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరుతున్నాయి. ఆర్థికంగా, సామాజికంగా 'చేయూత' లభిస్తుండడంతో ప్రజల జీవన ప్రమాణాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి.

ఆస్పత్రి, పాఠశాల అన్నీ బాగుపడ్డాయి..

నేడు ఏ ఊరికి వెళ్లినా, ఏ వీధిలో చూసినా అందమైన ప్రభుత్వ భవనాలు, అందులో సత్వర సేవలు, సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న ప్రభుత్వ పాఠశాలలు, సకల వసతులు, అవసరమైన సిబ్బంది, అన్ని రకాల మందులతో ఏ క్షణానైనా సేవలందించే ఆస్పత్రులు కన్పిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో నాడు-నేడు కింద బాగు చేసిన సుమారు 3,500 ప్రభుత్వ పాఠశాలల్లో ఏ స్కూలుకు వెళ్లి చూసినా ఆశ్చర్యం కలుగుతోంది. చూడచక్కని భవనాలు, పిల్లలు కూర్చొనేందుకు వీలుగా డెస్కులు, డిజిటల్ బోధనా పరికరాలు, బాలబాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు..ఇలా సకల సౌకర్యాలతో ఉన్న పాఠశాలలను చూస్తే 'కార్పొరేటు'కు మించి ఉన్నాయన్న భావన కలుగుతోంది. విదేశాల్లో ఉంటూ అప్పుడప్పుడు సొంతూళ్లకు వచ్చిపోయే వారు సైతం బాగుపడిన స్కూళ్లను చూసి ఆశ్చర్యపోతున్నారు. ఇది కదా అభివృద్ధి అంటూ కితాబిస్తున్నారు. ఇక ఊరూ వాడ మెరుగుపడిన ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులు ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నాయి. తల్లి కడుపులోని శిశువు మొదలుకుని మంచాన ఉన్న వృద్ధుడి వరకూ..ప్రతిఒక్కరికీ సేవలందిస్తున్నాయి. కరోనా కష్టకాలంలో మూడు దశల్లో 25,47,582 మందికి వైద్య సేవలు అందించారంటే ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైద్యారోగ్య వ్యవస్థ ఏ స్థాయిలో మెరుగుపడిందో అంచనా వేసుకోవచ్చు. ప్రాథమిక వైద్యం మొదలుకుని 'స్పెషాలిటీ' చికిత్స వరకూ అన్నీ ఇక్కడే అందుబాటులోకి వచ్చాయి. ఇలా అన్ని రంగాలు, అంశాల్లో మెరుగుపడిన స్థితి నుంచి..'మరింత మంచి' స్థితికి వెళ్లాలన్న ఆకాంక్ష మనందరిలో బలంగా ఉండాలి. మన ఆకాంక్షలు నెరవేర్చగలిగే, మన జిల్లా ప్రగతికి మరింత బాసటనిచ్చే సమర్థులు, విశ్వసనీయత కల్గిన నేతలను ఎన్నుకోవాలి. వంచకులను, ప్రగతినిరోధకులను ఓటు అనే ఆయుధంతో అడ్డుకోవాలి.

క్లుప్తంగా

భార్య, అత్తలపై దాడి

హిందూపురం అర్బన్: వ్యసనాలకు బానిసైన భర్త తన భార్య, ఆమె తల్లి, పినతల్లిపై కొడవలితో దాడి చేసిన ఘటన సంచలనం రేకెత్తించింది. వివరాలు... హిందూపురంలోని టీచర్స్ కాలనీకి చెందిన నవీన్... కిరికెర గ్రామానికి మీనాను నాలుగేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. అయితే వ్యసనాలకు బానిసైన భర్తను భరించలేక భర్తను వదిలేసి పుట్టింటికి మీన చేరుకుంది. ఈ క్రమంలో కొంత కాలంగా నవీన్ తన భార్యకు అసభ్యకర మెసేజ్‌లు పెడుతూ వచ్చాడు. దీంతో శనివారం రాత్రి 11 గంటల సమయంలో తన తల్లి నందిని, పినతల్లి రాజమ్మతో కలసి టీచర్స్ కాలనీకి వచ్చిన మీన... భర్తను. నిలదీసింది. ఆ సమయంలో సమాధానం చెప్పుకోలేని నవీన్ కొడవలితో భార్య, అత్తపై దాడి చేశాడు. బంధువులు జోక్యం చేసుకుని విడిపించి, క్షతగాత్రులను వెంటనే హిందూపురంలోని జిల్లా సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. వీరితో నందిని, రాజమ్మ పరిస్థితి విషమంగా ఉండడడంతో బెంగళూరుకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు హిందూపురం రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

యువకుడి కిడ్నాప్... దాడి


చికిత్స పొందుతున్న హరీష్

మడకశిర రూరల్: మండలంలోని ఆర్.అనంతపురం గ్రామంలో పాతకక్షల కారణంగా హరీష్ అనే యువకుడిని కొందరు వ్యక్తులు ఆదివారం సాయంత్రం కిడ్నాప్ చేశారు. బంధువు ఆంజనేయులు తెలిపిన మేరకు...బెంగళూరులో ఉంటున్న హరీష్ ఓటు వేసేందుకు స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం మదర్స్‌డే సందర్భంగా స్నేహితుడితో కలసి ద్విచక్ర వాహనంపై తొమ్మతిమర్రికెళ్లి కేక్ కొనుగోలు చేసుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. వెంబడించిన కొందరు వ్యక్తులు మార్గమధ్యంలో అడ్డుకుని హరీష్‌ను బలవంతంగా కారులో ఎక్కించుకుని వెళ్లారు. కిడ్నాపర్ల బారి నుంచి తప్పించుకున్న స్నేహితుడి సమాచారం మేరకు కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాలింపు చేపట్టిన పోలీసులు కర్ణాటక ప్రాంతం పావగడ తాలూకా కన్నెమేడి వద్ద వంకలో గాయాలతో పడి ఉన్న హరీష్‌ను గుర్తించి మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, తనను వంకలోకి తీసుకువెళ్లి కర్రలతో చితకబాదినట్లుగా బాధితుడు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'అనంత' రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం మార్పు

అనంతపురం సిటీ: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో నాల్గో ప్లాట్‌ఫాంను ఆదివారం నుంచి రద్దు చేసినట్లు స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్ తెలిపారు. ధర్మవరం, కదిరి, తిరుపతి, హిందూపురం, బెంగళూరు వైపు వెళ్లే రైళ్లన్నీ ఇకపై మూడో ప్లాట్‌ఫాంపైకి వస్తాయన్నారు. అమృత్ పథకంలో భాగంగా అనంతపురం రైల్వే స్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే శాఖ విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా నాల్గో ప్లాట్‌ఫాంను పూర్తిగా తొలగించడంతో మార్పు చేయాల్సి వచ్చిందన్నారు.

జిల్లా.. పరిశ్రమల ఖిల్లా

తండ్రి స్ఫూర్తి.. సర్కారు బాసట


హిందూపురంలోని 'ప్రోగ్రెసివ్ ఇండస్ట్రీస్'లో పనిచేస్తున్న కార్మికులు

రఘునాథరెడ్డి... పదో తరగతి వరకు చదువుకున్న ఆయన 1990లో ఉమ్మడి చిత్తూరు జిల్లా బి.కొత్తకోట నుంచి ఉపాధి కోసం హిందూపురానికి వలస వచ్చారు. అప్పట్లో హిందూపురం నలువైపులా స్పిన్నింగ్ మిల్లులు ఉండగా.. ఆయా పరిశ్రమల్లో చిన్నచిన్న పనులు కాంట్రాక్ట్‌కు తీసుకుని ఉపాధి పొందేవారు. ఈ క్రమంలోనే తానే సొంతంగా పరిశ్రమ ఏర్పాటు చేసి పది మందికి ఉపాధి కల్పించాలనుకున్నారు. 2006లో హిందూపురం శివారులోని తూమకుంట పారిశ్రామిక వాడలో అప్పటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో 'ప్రోగ్రెసివ్ స్టీల్స్' యూనిట్ ఏర్పాటు చేసి, చుట్టుపక్కల పరిశ్రమలకు అవసరమైన మెటీరియల్ తయారు చేసి ఇవ్వడం మొదలు పెట్టారు. రఘునాథరెడ్డి బాటలోనే ఆయన కుమారుడు ఆదిత్య నడిచారు. బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఆదిత్య తండ్రిలా తానూ సొంతంగా పరిశ్రమ స్థాపించాలనుకుని 2022లో పరిశ్రమల శాఖ కార్యాలయానికి వెళ్లి అధికారులతో చర్చించారు. ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలను తెలుసుకున్నారు. పరిశ్రమ నిర్వహణలో ఎదురయ్యే ఒడిదుడుకులు.. వాటిని ఎదుర్కొని ఎలా నిలదొక్కుకోవాలన్న అంశాలపై అధ్యయనం చేశారు. ఆ తర్వాత 'ప్రోగ్రెసివ్ ఇండస్ట్రీస్' పేరుతో పరిశ్రమ స్థాపనకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా ..ఎలాంటి జాప్యం లేకుండా అనుమతులు మంజూరయ్యాయి. రూ.60 లక్షల పెట్టుబడితో పరిశ్రమ ప్రారంభించారు. ఇప్పుడు 12 మంది కార్మికులతో పరిశ్రమ నడుపుతున్నారు. ఇందులో ఇతర పరిశ్రమలకు అవసరమయ్యే డయ్యింగ్ టూల్స్ తయారు చేసి ఇస్తున్నారు.

- రూ.16,456 కోట్లతో 48 భారీ పరిశ్రమలు
- రూ.20,555 కోట్లతో అదనంగా మరో పది పరిశ్రమలు
- రూ.1,867 కోట్లతో 8,164 ఎంఎస్ఎంఈలు
- రాయితీలతో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ప్రయోజనం
- లక్షలాది మందికి ఉపాధి
- పుట్టపర్తి సమీపంలో 111 ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటు
- హిందూపురం పారిశ్రామిక వాడలో కొన్నేళ్లుగా ఎందరికో ఉపాధి

సాక్షి, పుట్టపర్తి: నూతనంగా ఏర్పడిన శ్రీసత్యసాయి జిల్లా పరిశ్రమల ఖిల్లాగా విరాజిల్లుతోంది. ఇప్పటికే హిందూపురం సమీపంలోని తూమకుంట పరిధిలో వందల సంఖ్యలో పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఫలితంగా లక్షలాది మందికి ఉపాధి లభిస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత జిల్లాలో రూ.వేల కోట్లతో విరివిగా పరిశ్రమలు ఏర్పాటు కావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారీ, మధ్య, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు భారీగా రాయితీలు ప్రకటించడంతో చిరు వ్యాపారులు కుటీర పరిశ్రమల వైపు మొగ్గుచూపారు. జిల్లా కేంద్రం పుట్టపర్తి శివారు ప్రాంతంలో 111 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటవుతోంది. ఇప్పటికే రోడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఒకట్రెండు పరిశ్రమలు కూడా నిర్మితమవుతున్నాయి. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో భూముల విలువ భారీగా పెరిగింది. పారిశ్రామిక వాడ పూర్తి స్థాయిలో అందుబాటులోకొస్తే వేలాది మందికి ఉపాధి లభించనుంది.

48 భారీ పరిశ్రమలు..

అదనంగా మరో పది ఏర్పాటు..

జిల్లాలో ఇప్పటికే రూ.16,456 కోట్ల పెట్టుబడితో 48 భారీ పరిశ్రమలు నడుస్తున్నాయి. వీటి ద్వారా దాదాపు 25,628 మందికి ఉపాధి లభిస్తోంది. తాజాగా రూ.20,555 కోట్లతో మరో 10 భారీ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. వీటిల్లో 53,600 మందికి పని లభించనుంది. జిల్లా వ్యాప్తంగా రూ.1,867 కోట్లతో 8,164 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నడుస్తున్నాయి. ఇందులో 53,308 మంది కార్మికులు పనిచేస్తున్నారు. రాష్ట్రంలో ఏర్పాటుకానున్న కొత్త ఎంఎస్ఎంఈలకు ఐడీపీ 2020–23లో జనరల్, బీసీ పారిశ్రామిక వేత్తలకు వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం, 2020 – 23లో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు పెట్టుబడి రాయితీ, వడ్డీ రాయితీ, విద్యుత్ వినియోగ రాయితీ, అమ్మకపు పన్నుపై రాయితీ వర్తింపజేశారు.

రాయితీలు ఇలా..

పెట్టుబడిలో జనరల్– బీసీలకు 15 శాతం (రూ.20 లక్షలు మించకుండా), విద్యుత్ రాయితీలో యూనిట్‌కు రూపాయి, ఎస్‌జీఎస్‌టీ వడ్డీ రాయితీ మూడు శాతం వరకు ఉంటుంది. ఎస్సీ – ఎస్టీలకు అయితే పెట్టుబడి రాయితీ 45 శాతం (రూ.1.20 కోట్లు మించకుండా), విద్యుత్ రాయితీ యూనిట్‌కు రూ.1.5, ఎస్‌జీఎస్‌టీ వడ్డీ రాయితీ 9 శాతం వరకు ఉంటుంది. జిల్లాలో 2020 –21, 2021 – 22 సంవత్సరాల్లో 689 క్లైమ్‌లకు గానూ మొత్తం రూ.80.20 కోట్ల రాయితీ మంజూరైంది. అదేవిధంగా 2022 – 23, 2023 – 24 సంవత్సరాల్లో 236 యూనిట్లకు గానూ రూ.31.60 కోట్ల రాయితీ జమ అయ్యింది.

పీఎంఈజీపీ ద్వారా మరింత ప్రయోజనం..

ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ–2009) స్వయం ఉపాధి పథకం కింద ఉత్పత్తి, సేవా రంగాల పరిశ్రమలకు 15 నుంచి 35 శాతం వరకు మార్జిన్ మనీ అందుతుంది. ఇందులో ప్రాజెక్టు విలువ రూ.50 లక్షలు (ఉత్పత్తి రంగం), రూ.20 లక్షలు (సేవా రంగం) ఉంటుంది. పల్లె ప్రాంతాల్లో ప్రాజెక్టు విలువలో 35 శాతం రాయితీ, పట్టణ ప్రాంతాల్లో అయితే 25 శాతం వర్తిస్తుంది. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు వివిధ బ్యాంకుల ద్వారా 134 యూనిట్లకు రూ.388.60 లక్షల మార్జిన్ మనీకి గాను 137 యూనిట్లతో రూ.688.56 లక్షలు పొందారు.

పారిశ్రామిక విధానం భేష్



పరిశ్రమ ఏర్పాటుకు నేను దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లోపే ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. ప్రభుత్వ సహకారం మరువలేను. తూమకుంట పారిశ్రామిక వాడలో ఉన్న విప్రో, రోల్‌వెల్ పరిశ్రమలకు అవసరమైన డయ్యింగ్ టూల్స్ మా పరిశ్రమలో తయారు చేసి ఇస్తున్నాం. టర్నోవర్ బాగుండడంతో యూనిట్ వ్యయంలో కొంత సబ్సిడీ ఇచ్చేందుకు ప్రభుత్వం సమ్మతించింది. ఈ లెక్కన రూ.15 లక్షల వరకు రానుంది. రాష్ట్రంలో పారిశ్రామిక విధానం, అధికారుల సహకారం బాగున్నాయి.

– ఆదిత్య, పారిశ్రామికవేత్త, హిందూపురం

ఉపాధి లభిస్తోంది



పరిశ్రమలో ఆపరేటర్‌గా పని చేస్తున్నా. ఎనిమిది గంటలే పని అయినా... అదనపు సమయం పనిచేస్తే ఓటీ అలవెన్స్ ఇస్తున్నారు. దీంతో మా కుటుంబ ఆర్థిక అవసరాలు తీరాయి. నాతో పాటు మరో పది మంది పని చేస్తున్నారు.

– నరసింహమూర్తి, మిషన్ ఆపరేటర్, ప్రోగ్రెసివ్ ఇండస్ట్రీస్, తూమకుంట

సబ్ జైలులో సౌకర్యాలపై జిల్లా జడ్జి ఆరా


ఖైదీలతో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

ధర్మవరం రూరల్: హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలోని సబ్ జైళ్ల తనిఖీలో భాగంగా ఆదివారం ధర్మవరం సబ్ జైలును జిల్లా జడ్జి శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రతి గదినీ క్షుణ్ణంగా పరిశీలించారు. భోజన సదుపాయాలు, వసతులు తదితర వాటి గురించి ఖైదీలతో ఆయన ఆరా తీశారు. ఎవరికైనా న్యాయవాది లేకుంటే తాను ఏర్పాటు చేయిస్తానని ఖైదీలకు సూచించారు. ఈయన వెంట ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి, జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి, సబ్ జైలు సూపరింటెండెంట్ బ్రహ్మారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు హెచ్‌ఎంల దుర్మరణం

- మరో ఇద్దరు ఉపాధ్యాయులకు తీవ్ర గాయాలు


ధనుంజయ(ఫైల్)


శ్రీకృష్ణ(ఫైల్)

పావగడ: కారు బోల్తాపడిన ఘటనలో ఇద్దరు ప్రధానోపాధ్యాయులు దుర్మరణం పాలయ్యారు. మరో ఇద్దరు ఉపాధ్యాయులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.....పావగడలో నివాసముంటున్న శ్రీకృష్ణ (48), ధనుంజయ (58), నరసింహ, వెంకటాచలపతి ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. వీరిలో పావగడ తాలూకా గౌడేటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా శ్రీకృష్ణ, పావగడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యయుడిగా ధనుంజయ పనిచేస్తున్నారు. తుమకూరులో శనివారం జరిగిన ఓ పెళ్లి రిసెప్షన్ వేడుకకు నలుగురూ కారులో వెళ్లారు. వేడుక ముగిసిన తర్వాత రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం వేకువజాము 3 గంటల సమయంలో పావగడ సమీపంలోని కణివేనహళ్లి గేటు వద్దకు చేరుకోగానే కారు నడుపుతున్న శ్రీకృష్ణ నిద్రమత్తులో తూలడంతో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న బాండ్ రాళ్లను ఢీకొని పల్టీలు కొట్టింది. ఘటనలో శ్రీకృష్ణతో పాటు ధనుంజయ అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు ఉపాధ్యాయులు నరసింహ, వెంకటచలపతి గాయాలతో ప్రాణాపాయం నుంచి బయట పడ్డారు. క్షతగాత్రులను వెంటనే బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉంచిన మృతదేహాలను చూసి మృతుల భార్యాపిల్లలు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న స్థానిక మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప... ఆస్పత్రికి చేరుకుని మృతుల కుటుంబాలను పరామర్శించి, ఓదార్చారు. విద్యాశాఖ బీఆర్సీ వెంకటేశులు, ఈసీఓ వేణుగోపాలరెడ్డి, ఇతర ఉపాధ్యాయులు ఆస్పత్రికి మృతులకు నివాళులర్పించారు.

జిల్లా ఏర్పాటు.. అభివృద్ధికి తోడ్పాటు


పుట్టపర్తిలోని సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ



- పట్టణ శివారులో విరివిగా లేఅవుట్‌లు
- నాగరికతకు అద్దం పడుతూ నూతన రహదారుల ఏర్పాటు
- ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుతో అందరికీ మేలు
- నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా జిల్లాకు రూ.16,716.38 కోట్ల లబ్ధి

సాక్షి, పుట్టపర్తి: కొత్త జిల్లాల ఏర్పాటు ప్రాంతాల అభివృద్ధికి తోడ్పాటుగా నిలిచింది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి పార్లమెంటు నియోజకవర్గాన్ని ఓ జిల్లాగా చేసింది. ఇందులో భాగంగా హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మడకశిర, పెనుకొండ, హిందూపురం, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాలతో పాటు రాప్తాడు నియోజకవర్గంలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలను కలుపుతూ పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటైంది. కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత అన్ని ప్రభుత్వ శాఖలు తరలివచ్చాయి. కొత్త రహదారుల నిర్మాణం ఊపందుకుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారమూ పుంజుకుంది. జిల్లా కేంద్రం చుట్టుపక్కల కొత్తగా లేఅవుట్‌లు పుట్టుకొస్తున్నాయి. భూముల విలువ పది రెట్లు పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ఎస్పీ కార్యాలయం స్థానికంగా ఉండటంతో భద్రత పెరిగింది. క్రైమ్ రేట్ కూడా గణనీయంగా తగ్గింది. జిల్లా వ్యాప్తంగా 16.39 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న వివిధ పథకాల ద్వారా గత నాలుగున్నరేళ్లలో సుమారు రూ.16,716 కోట్ల మేర లబ్ధి చేకూరింది.

నిర్మాణాలతో కళకళ..

పుట్టపర్తి చుట్టుపక్కల కొత్త కాలనీలు ఏర్పాటవుతున్నాయి. సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి చుట్టుపక్కల పెద్ద భవంతులు నిర్మాణంలో ఉన్నాయి. విమానాశ్రయం ఎదుట నివాసాల కోసం గుట్టలు చదును చేస్తున్నారు. ఏపీఐఐసీ ఎదురుగా మరిన్ని వెంచర్లు వేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంది. జిల్లా కేంద్రానికి రాకపోకలు పెరిగాయి. బస్సు సర్వీసుల సంఖ్య పెరిగింది. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారులు వస్తున్నారు. కోడూరు నుంచి ముదిగుబ్బ వరకు పుట్టపర్తి మీదుగా ఎన్‌హెచ్ 342 రోడ్డు పనులు జరుగుతున్నాయి.

పెరిగిన భూముల విలువ..

కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత భూముల విలువ విపరీతంగా పెరిగింది. పుట్టపర్తి చుట్టుపక్కల సెంటు రూ.10 లక్షల వరకు ధర పలుకుతోంది. గోరంట్ల వైపు మరింత ఎక్కువ ధరలు ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. హిందూపురం నుంచి పాలసముద్రం వెళ్లే మార్గంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీనికి తోడు కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి సమీపంలో ప్రభుత్వ కార్యాలయాలు వచ్చాయి. ఫలితంగా చాలామందికి స్థానికంగా ఉపాధి లభిస్తోంది.

జిల్లాలో 2019 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, లబ్ధి వివరాలు

పథకాలు	లబ్ధి
వ్యవసాయం	రూ.2,569.43 కోట్లు
విద్య	రూ.1,666.84 కోట్లు
సామాజిక పింఛన్లు	రూ.4,131 కోట్లు
జగనన్న తోడు	రూ.121.03 కోట్లు
వైఎస్సార్ ఆసరా	రూ.863.04 కోట్లు
వైఎస్సార్ సున్నావడ్డీ	రూ.234.27 కోట్లు
వైఎస్సార్ చేయూత	రూ.915.48 కోట్లు
వైఎస్సార్ బీమా	రూ.40.86 కోట్లు
బ్యాంకు లింకేజీ	రూ.5,301 కోట్లు
ఆరోగ్యశ్రీ	రూ.289.39 కోట్లు
ఆరోగ్య ఆసరా	రూ.40 కోట్లు
జగనన్న చేదోడు	రూ.39.99 కోట్లు
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	రూ.50.583 కోట్లు
వైఎస్సార్ కాపు నేస్తం	రూ.38.48 కోట్లు
ఇమామ్‌లకు గౌరవ వేతనం	రూ.20.85 కోట్లు
వాహనమిత్ర	రూ.23.70 కోట్ల లబ్ధి
దేవాలయాల్లో అర్చకులకు	రూ.0.127 కోట్లు
పేదలందరికీ ఇళ్లు	రూ.370.32కోట్లు

వ్యక్తులపై దూసుకెళ్లిన కారు

- ముగ్గురికి గాయాలు


గాయపడిన లక్ష్మీకాంత

అగళి: రోడ్డు పక్కన నిలబడిన ముగ్గురిపై ఓ కారు శరవేగంగా దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన మేరకు... అగళి మండలంఆలూడి గ్రామానికి చెందిన లోకేష్, లక్ష్మీకాంత, నరసింహారాజు ఆదివారం రాత్రి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డు పక్కన నిలబడి ఉన్నారు. ఆ సమయంలో అగళి నుంచి పట్టనాయకనహళ్లి వైపు వేగంగా వెళుతున్న కారు డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో వారి మీదుగా దూసుకెళ్లింది. లోకేష్, లక్ష్మీకాంతపై కారు చక్కాలు ఎక్కి కొంత దూరం లాక్కెళ్లాయి. చుట్టుపక్కల వారు గట్టిగా కేకలు వేయడంతో డ్రైవర్ వాహనాన్ని ఆపాడు. స్థానికులు వెంటనే కారు ఎత్తి కింద పడిన లోకేష్, లక్ష్మీకాంతను వెలికి తీశారు. అనంతరం క్షతగాత్రులను శిరా లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లోకేష్‌కు తలకి బలమైన గాయాలయ్యాయి.లక్ష్మీకాంతకు కాలు విరిగింది. నరసింహరాజు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ వీరేష్ అక్కడకు చేరుకుని ఘటనపై స్థానికులతో ఆరా తీశారు. ప్రమాదానికి గురైన కారును స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

చెత్తకుప్పలో మృతశిశువు శరీర భాగాలు

మడకశిర: పట్టణంలోని శివాపురం వద్ద వద్ద ఉన్న చెత్తకుప్పలో నవజాత ఆడ శిశువు శరీర భాగాలు చెత్తకుప్పలో కనిపించడంతో మడకశిర వాసులు ఉలిక్కిపడ్డారు. ఆడ పిల్ల అని వద్దనుకున్నారో... లేదా మృత శిశువును చెత్త కుప్ప పాలు చేశారో తెలియడం లేదు. శిశువు శరీరాన్ని కుక్కలు పీక్కు తినడం వల్ల తల, కాళ్లు, చేతులు తదితర శరీర భాగాలు ముక్కలుగా విడిపోయాయి.

వివాహిత ఆత్మహత్య

గుంతకల్లు రూరల్: క్షణికావేశానికి లోనై ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం వెంకటాంపల్లికి చెందిన అంజినాయక్‌కు ఏడాదిన్నర క్రితం మంజులాబాయి (20)తో వివాహమైంది. వీరికి 6 నెలల వయసున్న ఓ బాబు ఉన్నాడు. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని అంజినాయక్ పోషించుకుంటున్నాడు. ఆదివారం ఉదయం చిన్నపాటి విషయాన్ని దంపతులు గొడవపడ్డారు. క్షణికావేశానికి లోనైన మంజులాబాయి భర్త బయటకు వెళ్లగానే చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు విషయాన్ని గుర్తించి వెంటనే మంజులాబాయిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై గుంతకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మృతుడు వినోద్‌కుమార్

రొద్దం: మండలంలోని పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన నాగప్ప కుమారుడు వినోద్‌కుమార్ (34) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఇంటి వద్ద తాగునీటి కోసం ఏర్పాటు చేసిన మోటార్‌ను ఆదివారం ఆన్ చేస్తుండగా కరెంట్ ప్రసరించడంతో షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఓ కుమారుడు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రియుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ప్రియురాలు

- తీవ్రంగా గాయపడిన బాధితుడు


తీవ్ర గాయాలతో మోహన్

రాయదుర్గంటౌన్: తనతో కలవడం లేదన్న కోపంతో ఓ మహిళ ప్రియుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. అతను తీవ్ర కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన రాయదుర్గం పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాజీవ్ గాంధీ కాలనీలో నివాసం ఉంటున్న మేస్త్రీ రమేష్ కుమారుడు మోహన్ తాపీగా మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఇతను అదే కాలనీకి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించేవాడు. కుటుంబ సభ్యులు మందలించి సదరు మహిళతో కలవకుండా మోహన్‌ను కట్టడి చేశారు. దీంతో ఆమె కోపం పెంచుకుంది. ఆదివారం ఇంటికి వస్తున్న మోహన్‌పై సదరు మహిళ పెట్రోల్ చల్లి నిప్పంటించింది. తీవ్రంగా గాయపడిన అతన్ని కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. బాధితుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా శంకరాచార్యుల జయంతి

అనంతపురం కల్చరల్: నగరములోని శంకర మఠాల్లో ఆదివారం శంకర జయంతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేష అలంకార సహిత పూజలు, నగరోత్సవాలు, పల్లకీ సేవలు ఘనంగా జరిగాయి. మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలోని శంకరమఠంలో జగద్గురువు ఆది శంకరుల జయంత్యుత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బ్రాహ్మణ ఉపనయన సేవా సంఘం ఆధ్వర్యంలో నగర వీధుల్లో జగద్గురువుల ఉత్సవ విగ్రహాలను భక్తజన సంకీర్తనల నడుమ ఊరేగించారు. మధ్యాహ్నం నారాయణ సేవ (అన్న సంతర్పణ) కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశీకులు రామసుబ్రహ్మణ్యం , ఉపనయన సేవా సమితి నిర్వాహకులు సాయి శివరాం, రఘు, రాఘవేంద్ర జోషి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలింగ్‌స్టేషన్ల పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ స్టేషన్లపై కలెక్టర్ అరుణ్ బాబు ఆదివారం సాయంత్రం మాక్ డ్రిల్ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆయన పోలింగ్ సిబ్బందితో సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు, మహిళలు తదితర పోలింగ్‌స్టేషన్‌లలో ఓటు వినియోగంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



ఏజెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: నియోజవర్గం వ్యాప్తంగా సోమవారం జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఆదివారం తన కార్యాలయంలో వారికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెంట్ ఫారాలు, ఓటర్‌లిస్ట్, ఎన్నికల నియమావళి, తీసుకొని ఉదయం 6 గంటలకు పోలింగ్ స్టేషన్‌కు చేరుకోవాలన్నారు. నింబంధనలు పాటిస్తూ ప్రత్యర్థి ఏజెంట్ సభ్యులు కవ్వింపు చర్యలకు పాల్పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవీఎంలు, వీవీప్యాట్లు పనితీరు ఏమైనా లోపాలుఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పోలింగ్ బూత్‌లలో ఏమైన సమస్యలు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్ సారథ్యంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇందాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఈఓ గంగప్ప, లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో రాహిబ్, ఫైసల్ ఖాన్ జట్లు తలపడగా, ఫైసల్ ఖాన్ జట్టు విజయం సాధించింది. రన్నర్‌గా రాహిబ్ జట్టు నిలిచింది. వీరికి మెమోంటోలను అందజేసి, ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో చైతన్య గంగిరెడ్డి, ఉబేదుల్లా, ఫైల్వాన్ ఫయాజ్, దాదు, అబ్దుర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిని సందర్శించిన కర్ణాటక న్యాయమూర్తి



జడ్జి బసవరాజుకు పూర్ణ కుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

లేపాక్షి: లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయాన్ని ఆదివారం ఉదయం కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ బసవరాజుతో పాటు వారి కుటుంబ సభ్యులు సందర్శించారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ఆలయంలోని దుర్గాదేవి, వీరభద్రస్వాముల వారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ విశిష్టతను తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు.

శాంతిభద్రతలే లక్ష్యంగా పని చేయాలి

తాడిమర్రి: శాంతిభద్రతలే లక్ష్యంగా పని చేయాలని ఎస్‌ఐ ఎం.నాగస్వామి సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని గ్రామాల్లో సోమవారం సార్వత్రిక ఎన్నికల జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం ఆయన పోలీసు సిబ్బందిని ఆరు మొబైల్ టీంలుగా ఏర్పాటు చేశారు. ఆరు టీములకు ఆరు వాహనాలను ఏర్పాటు చేసి ఎన్నికలు ముగిసేవరకూ మండలంలోని 32 పోలింగ్ బూతుల పరిధిలో పర్యవేక్షించాలని ఆయన సిబ్బందికి సూచించారు.

పెనుకొండ.. ఎవరికి అండ?!



పెనుకొండలో పూర్తయిన కొండ రోడ్డు



చివరి దశలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం

- వైఎస్సార్‌సీపీ వైపే ఓటర్ల మొగ్గు
- జగన్‌పై నమ్మకంతో ముందడుగు

పెనుకొండ: నియోజకవర్గ ప్రజలు సంక్షేమాభివృద్ధికే జై కొట్టనున్నట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పెనుకొండతో పాటు గోరంట్ల, సోమందేపల్లి, పరిగి, రొద్దం మండలాల్లో రోడ్లు, డ్రైనేజీలు, వివిధ పరిశ్రమల ఏర్పాటుపై జగన్ ప్రభుత్వం పట్ల ప్రజల నుంచి సానుకూలత ఉన్నట్లు భావిస్తున్నారు. నియోజకవర్గం నూతన శోభను సంతరించుకోవడం వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి కలిసివచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

సంక్షేమ పథకాలపై సంతృప్తి

చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో రూ.2.20 లక్షల కోట్లను 2.10 లక్షల మంది లబ్ధిదారులకు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. అమ్మఒడి, విద్యాదీవెన, విద్యాకానుక, ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, రైతు భరోసా, నేతన్న నేస్తం, వైఎస్సార్ చేయూ, వైఎస్సార్ ఆసరా, పింఛన్ల పంపిణీ ఇలా ఏ పథకం తీసుకున్నా అర్హతే ప్రామాణికంగా ఇంటి ముంగిటమే పథకాలను అందించడంపై ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. పేదల జీవన ప్రమాణల్లో కూడా మార్పురావడంతో అందరూ వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపుతున్నారు.



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్

అభివృద్ధి పనులతో ఆదరణ

పెనుకొండను నగర పంచాయతీగా మార్చిన ఘనత కూడా సీఎం జగన్‌దే. దీనికి తోడు గతంలో ఎన్నడూ ఎవరూ చేయని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరిగాయి. సచివాలయాలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పాయి. రూ.1200 కోట్లతో పనులు చేపట్టగా ఇప్పటికే మెజార్టీ పనులు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రజలంతా వైఎస్సార్‌సీపీకి తమ మద్దతు తెలియజేసేందుకు రెడీ అయ్యారు.

ఉషశ్రీచరణ్‌కు మద్దతు

మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్‌కు నియోజకవర్గంలో ప్రజల నుంచి సానుకూల స్పందన ఉంది. తక్కువ సమయంలోనే ఆమె నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. దీనికి తోడు పెనుకొండ అభివృద్ధి తన బాధ్యత అంటూ ప్రచారం చేశారు. మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయించడంతో పాటు మరిన్ని పరిశ్రమలను నెలకొల్పుతామని చెప్పడంతో మెజార్టీ ప్రజలు ఫ్యాన్‌కు మద్దతు తెలియజేస్తున్నారు.

సవిత మెడకు కేసులు

టీడీపీ అభ్యర్థి సవితపై వివిధ కేసులు నమోదు కావడం కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఉషశ్రీచరణ్‌కు కలిసొస్తున్నట్లు రాజకీయ పండితులు చెబుతున్నారు. దీంతో ఎక్కువ మంది ప్రజలు వైఎస్సార్‌సీపీకి జై కొడుతున్నట్లు పేర్కొంటున్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ చేరిన యువకులు

పుట్టపర్తి రూరల్: మెదటిసారిగా తమ ఓటును ఫ్యాన్ గుర్తుకు వేయాలని బావించిన పలువురు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పుట్టపర్తి మున్సిపాలిటీకి పరిధిలో ఎనుములపల్లి గోకులం గ్రామాలకు చెందిన 15 కుటుంబాలు పార్టీలో చేరాయి. ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారీతో గెలిపించాలన్నారు. పార్టీలోకి చేరిన వారిలో కుమ్మర సాయికుమార్, నూర్ అహమ్మద్, సాయి మోహన్, సాయిప్రసాద్, కుమ్మరి సాయికుమార్, మోనూ శ్రీప్రసాద్, భార్గవ్, సాయితేజ, సాయిధనుష్, సాయి అశోక్‌కుమార్, సాయినాగ, పణికుమార్, హర్షవర్ధన్, రాజశేఖర్, షాకూర్, ఉన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాలతో పర్యవేక్షణ

బత్తలపల్లి: అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా కేంద్ర బలగాలతో పర్యవేక్షించనున్నట్లు ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు, బత్తలపల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. రూరల్ సర్కిల్‌లో 12, బత్తలపల్లి పరిధిలో మాల్యవంతం, ఈదుల ముష్టూరు, పోట్లమర్రి, బత్తలపల్లి, అప్పరాచెరువు, డి.చెర్లోపల్లి గ్రామాలను అత్యంత సమస్యాత్మక గ్రామాలు గుర్తించామన్నారు.

మరోసారి ఆశీర్వదించండి



దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే

పుట్టపర్తి: పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం తనను మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం పుట్టపర్తిలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగనన్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చారన్నారు. విద్య, వైద్యరంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. సంస్కరణలు పూర్తి స్థాయిలో అమలు కావాలంటే జగనన్న ప్రభుత్వం రావాల్సిందేనన్నారు. అర్హులందరికీ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత ఎన్నికల్లో హామీ మేరకు నియోజకవర్గంలోని 193 చెరువులు నింపేలా రూ.864 కోట్లతో పనులు చేపట్టామన్నారు. అతి త్వరలో పనులు పూర్తి చేసి నియోజకవర్గంలో వేలాది ఎకరాలకు సాగు నీరు అందిస్తామన్నారు. పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువును కలుపుతూ సుమారు 15 కిలోమీటర్ల రింగ్ రోడ్డు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు. నియోజకవర్గం మీదుగా 3 జాతీయ రహదారులు వెళ్తున్నాయని, అవి పూర్తయితే పరిశ్రమలను ఏర్పాటు చేయించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రెట్టింపు సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తామన్నారు.

హామీలు నెరవేర్చిన వారికే పట్టం!

- పుట్టపర్తి నియోజకవర్గంలో ఫ్యాన్ గాలి !
- సంక్షేమం, అభివృద్ధే విజయ సోపానాలు

పుట్టపర్తి: సార్వత్రిక ఎన్నికల్లో పుట్టపర్తి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గెలుపు దిశగా దూసుకుపోతున్నట్లు రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. గడచిన పదేళ్లుగా నియోజకవర్గంలో అన్ని మండలాలు, గ్రామాల్లో విస్తృత సంబంధాలు కలిగి ఉండటంతో పాటు ప్రజలతో మమేకమవ్వడం ఆయన కలిసి వచ్చే అవకాశమని చెబుతున్నారు. కరోనా లాంటి కష్టకాలంలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి అండగా నిలిచారని వారు గుర్తు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇవ్వడం దుద్దుకుంటకు ప్లస్‌గా మారినట్లు అంచనా. మరోవైపు ఎమ్మెల్యే ఎన్నికల హామీలు నెరవేర్చడంతో ప్రజల్లో ఆయన పట్ల సానుకూలత ఏర్పడినట్లు భావిస్తున్నారు.

చరిత్రలో నిలిచేలా శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఉన్న అనుబంధంతో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఆవిర్భావం కోసం కృషి చేశారు. జిల్లా ఏర్పాటులో శ్రీధర్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారు. హిందూపురం పార్లమెంట్ పరిధిలో ఉన్న అందరూ ఎమ్మెల్యేలు, ఎంపీ, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని జిల్లా సాధనకు పాటుపడ్డారు. ఇందులో భాగంగా 2022 ఏప్రిల్ 4న నూతన జిల్లా ఏర్పాటైంది. శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు కావడంతో ప్రజలకు ప్రభుత్వానికి అంతరం తగ్గింది. పనుల పరిష్కారం కోసం అనంతపురం వెళ్లే పని లేకుండా పోయింది. కలెక్టరేట్, అన్ని జిల్లా శాఖల కార్యాలయాలు పుట్టపర్తిలోనే అందుబాటులోకి వచ్చాయి.



193 చెరువులకు నీళ్ల నింపే పనులకు శ్రీకారం

సీఎంగా జగన్ ప్రమాణం చేసినప్పటి నుంచి పుట్టపర్తి నియోజకవర్గంలో ఉన్న 193 చెరువులకు హంద్రీ–నీవా కాలవ ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కృష్ణా జలాలతో నింపాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పని చేశారు. ఈ క్రమంలోనే రూ.864 కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. ఇది పూర్తయితే ఈప్రాంతం సస్యశ్యామలం అవుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి 17న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ పనులను కూడా ప్రారంభించారు.

ముందే చేతులెత్తేసిన పల్లె

ఎన్నికలకు ముందే మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి చేతులెత్తేసినట్లు రాజకీయ పండితులు చెబుతున్నారు. నియోజకవర్గ ప్రజలతోపాటు టీడీపీ శ్రేణుల నుంచే ఆయన అభ్యర్థిత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో పార్టీ అధిష్టానం బీసీలకు పుట్టపర్తి సీటు కేటాయిస్తామని లీకులిచ్చింది. తర్వాత ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, జగన్ ప్రభుత్వానికి ఉన్న సానుకూలతతో టీడీపీ అధిష్టానం మల్లాగుల్లాలుపడింది. చివరకూ దిక్కుతోచనిస్థితుల్లో ఆర్థికంగా ఉన్న పల్లె వైపు మొగ్గచూపింది. అయితే పల్లె అయితే ఇబ్బందవుతుందని ఆయన కోడలు సింధూరరెడ్డిని బరిలోకి దించింది. ఈక్రమంలో నియోజకవర్గంలో బీసీలంతా టీడీపీకి వ్యతిరేకంగా మారిపోయారు. పల్లె కుటుంబంపై వ్యతిరేకత, టీడీపీ ఆచరణ సాధ్యం కాని మేనిఫెస్టో సైకిల్‌కు ఇబ్బందిగా పరిణమించినట్లు ఆ పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు.

సంక్షేమం, అభివృద్ధి ఇలా..

- పుట్టపర్తి సమీపంలో బ్రాహ్మణపల్లి వద్ద 2 వేలమంది ఇంటి పట్టాలిచ్చి గృహాలు మంజూరు చేశారు.
- కర్ణాటకనాగేపల్లి నుంచి చిత్రావతి వరకు బీడుపల్లిలో రూ.5 కోట్లతో సిమెంట్ రోడ్డు వేయించారు.
- పుట్టపర్తిలో పర్యాటకులను ఆకర్షించేలా చిత్రావతి నదిలో బోటింగ్ ఏర్పాటు చేశారు.
- పుట్టపర్తి రూరల్ మండలంలో 800 ఇంటి పట్టాలు, ఇళ్ల మంజూరు. రూ.3 కోట్లతో సిమెంట్ రోడ్లు, 10 గ్రామ సచివాలయాలు, 9 ఆర్బీకేలు, 4 విలేజ్ క్లినిక్స్ నిర్మాణం
- పుట్టపర్తి పరిధిలోని కర్ణాటకనాగేపల్లి, కోవెలగుట్టపల్లి, ఎనుములపల్లి మీదుగా పెడపల్లి బత్తలపల్లి మీదుగా 342 జాతీయ రహదారి పోయేలా ఎమ్మెల్యే కృషి చేశారు. మండలంలో పలు గ్రామాలను లింకు రోడ్లు నిర్మించారు.
- బుక్కపట్నం మండలంలో పేదలకు 3 వేలు ఇంటి పట్టాలు, ఇంటి నిర్మాణాలకు తోడ్పాటునిచ్చారు. గశికవారిపల్లి, అరుణగిరి(గరుగుతండా)గూనిపల్లి, బుక్కపట్నం మీదుగా 342 జాతీయ రహదారి పోయేలా శ్రీధర్‌రెడ్డి కృషి చేశారు.
- ఎన్నో ఏళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న ముదిగుబ్బ రోడ్డు నుంచి సిద్దరాంపురంవరకు రూ.2 కోట్లుతో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేశారు. మండలంలో పలు గ్రామాల్లో మరో రూ.3 కోట్లతో సిమెంట్ రోడ్లు నిర్మించారు.
- కొత్తచెరువు మండలంలో రూ.లక్షల విలువైన ఇంటి స్థలాలతోపాటు ఇళ్లు మంజూరు చేశారు. మండల కేంద్రం ధర్మవరం రోడ్డు సమీపంలో ఒక్కో లబ్ధిదారుకు రూ.10 లక్షలు విలువైన ఇంటి పట్టా ఇచ్చి ఇళ్ల మంజూరు చేశారు. మండలంలో రూ.2 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించారు. ఇవేగాక గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్ నిర్మాణాలు పూర్తి చేశారు.
- కొత్తచెరువు కేంద్రంగా మార్కెట్ యార్డును తాత్కాలికంగా ఏర్పాటు చేశారు.
- నల్లమాడ సమీపంలో అరవవాండ్లపల్లి తండా సమీపంలో పాలిటెక్నిక్ కళాశాల కోసం స్థలం కేటాయించి స్థలాన్ని అభివృద్ధికి కృషి చేశారు. మండలంలో 4 వేల ఇళ్లకు పైగా మంజూరు చేశారు.రూ.10 కోట్లతో సీసీరోడ్ల నిర్మించారు.
- ఓడీచెరువు మండల పరిధిలో 716 జాతీయ రహదారి మంజూరుకు ఎమ్మెల్యే కృషి సల్పారు. 3 వేల ఇంటి పట్టాలిచ్చి ఇంటి నిర్మాణాలకు కృషి చేశారు.

కందికుంటకు ఓటేస్తే ఇక అంతే

- మీడియాతో మాజీ మంత్రి మహమ్మద్ షాకీర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి షాకీర్

కదిరి: 'టీడీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్‌కు దయచేసి ఎవ్వరూ ఓటు వేయకండి. ఆయనకు ఓటేస్తే ఇక అంతే. అందుకే ప్రతి ఓటరుకు చేతులు జోడించి చెబుతున్నాను' అని మాజీ మంత్రి మహమ్మద్ షాకీర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన తన స్వగృహంలో మీడియాతో మాట్లాడారు. 2014 ఎన్నికల్లో కందికుంట ఓడిపోతే 'ముస్లింలు ఒక్క నా కొడుకు నాకు ఓటు వేయలేదు.. అని కందికుంట అన్న మాటలు ప్రతి ముస్లిం మదిలో మెదులుతున్నాయని ఆయన గుర్తు చేశారు. వలీసాబ్‌రోడ్‌లోకి వచ్చి 'ఒరేయ్.. ఇదేమైనా పాకిస్థానా..ఎక్కువగా మాట్లాడితే మిమ్మల్ని పాకిస్థాన్‌కే తరిమేస్తా..' అని ఆయన చెప్పిన మాటలు ఎలా మరచిపోతాం..అని షాకీర్ తెలియజేశారు. కదిరి–హిందూపురం రోడ్‌లో వీవర్స్ కాలనీ వద్ద పేద ముస్లింలకు చెందిన 3 ఎకరాల స్థలాన్ని కబ్జా చేసి, దానికి నకిలీ పత్రాలు సృష్టించి, ఆ స్థలం చుట్టూ కంచె వేసిన విషయాన్ని ప్రతి ముస్లింను కలిచివేస్తోందన్నారు. కందికుంటను గెలిపిస్తే కబ్జాలకు సహకరించినట్లేనని ఆయన హెచ్చరించారు. 'పైసా పైసా పోగుచేసి 3 సెంట్లు భూమి కొనుగోలు చేస్తే అలాంటి స్థలాలను కూడా కందికుంటతో పాటు ఆయన అనుచరులు కబ్జాలు చేస్తున్నారు..ఈసారి ఆయనను గెలిపిస్తే కదిరిలో ఆయన వర్గీయులు అరాచకం సృష్టించడం ఖాయం' అని హెచ్చరించారు. పట్టణంలో ప్రతి దుకాణం నుండి వారు నెలసరి మామాళ్లు వసూలు చేయడం ఖాయమన్నారు. హిందూ,ముస్లింలు కదిరిలో కలిసిమెలిసి జీవిస్తున్నారని, ఇలాంటి చోట ఆయన 2014 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత అన్న మాటలు ప్రతి ఒక్కరినీ కలిచి వేశాయన్నారు. ప్రతి ఒక్కరూ ఈ విషయం గుర్తుంచుకొని, అందరూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి.. సౌమ్యుడైన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బి.ఎస్.మక్బూల్‌ను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈయన కబ్జాలు చేయడు..బ్యాంకులు దోపీడి చేయడు..క్రిస్టియన్ బోర్డింగ్ స్కూల్‌ను కూల్చివేయడు..అందుకే మక్బూల్‌ను ఎమ్మెల్యేని చేసుకుందాం..అని మాజీ మంత్రి పేర్కొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

పరిగి: సార్వత్రిక ఎన్నికలు సోమవారం జరగనున్నాయి. దేశంలోని పార్లమెంట్ స్థానాలతో పాటూ రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగబోతున్నాయి. ఇప్పటికే మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ జరగనుంది. సమయం దాటిన తరువాత క్యూలైన్‌లో ఉన్న వారికి మాత్రమే ఓటు వేసే అధికారాన్ని పొందుతారని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు. పరిగి మండలంలో మొత్తం 46,138 మంది ఓటు హక్కును వినియోగించబోతున్నారు. వీరిలో 23,287 మంది పురుష ఓటర్లు ఉండగా మరో 22,851 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మొత్తం 53 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు తమ ఓటును వేయడానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. ప్రధానంగా ప్రతి పోలింగ్ బూత్‌లలో ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు బారికేడ్లు, టెంట్లు, తాగు నీరు, లైట్లు, గాలి వెలుతురు సౌకర్యం తదితర మౌళిక వసతులతో పాటూ వయో వృద్ధులకు, వికలాంగులకు ఓటేయడానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. కాగా ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్‌తో ఓటరు సరళిని పర్యవేక్షించే అధునాతన సౌకర్యాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోలీసులు గట్టి భద్రతా చర్యలను చేపట్టారు.

సోమందేపల్లి: మండలంలోని 42 పోలింగ్ స్టేషన్‌లలో పోలింగ్ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల పరిధిలో 39,042 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పరిగిలోని పోలింగ్ కేంద్రం వద్ద బ్యారికేడ్లను ఏర్పాటు చేసిన దృశ్యం

గోరంట్ల: మండల వ్యాప్తంగా 20 గ్రామ పంచాయతీల్లో 70 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 64,432 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 476 మంది సిబ్బందిని ఎన్నికల విధులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అక్బల్‌బాషా పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు.

'కోటంక'లో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

హిందూపురం అర్బన్: కర్ణాటక నుంచి హిందూపురానికి ఆదివారం అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం (టెట్రా ప్యాకెట్లు)ను సెబ్ పోలీసులు పట్టుకున్నారు. సెబ్ పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా పోచనపల్లి వద్ద లక్ష్మీపురం గ్రామానికి చెందిన హరీష్‌కుమార్ అనే వ్యక్తి ఒక బ్యాగులో 5 బాక్సులు (480 ప్యాకెట్లు)పట్టుకొని సీజ్ చేశారు. హరీష్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. అలాగే నింకంపల్లి బ్రిడ్జి వద్ద మరో వ్యక్తి ద్విచక్ర వాహనంలో 2 బాక్సుల్లో తరలిస్తున్న మద్యాన్ని (144 ప్యాకెట్లు) సీజ్ చేశారు. పట్టణంలోని మేళాపురానికి చెందిన గోవిందప్ప అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐలు రామ్‌ప్రసాద్, కమలాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన మద్యంతో పోలీసులు